క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధికి కృషి



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈఓ మునిసుబ్రహ్మణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ : పాఠశాల అభివృద్ధికి ఎస్ఎంసీ కమిటీలు కృషి చేయాలని ఎంఈఓ మునిసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బుధవారం కనమనంబేడులోని ప్రాథమిక పాఠశాల్లో ఎస్ఎంసీ చైర్మన్, కమిటీ సభ్యులకు శిక్షణ ఇచ్చారు. పాఠశాలలో జరిగే ప్రతి అభివృద్ధిలోనూ ఎస్ఎంసీ కమిటీ భాగస్వాములు కావాలన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్నభోజనంలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని పెట్టాలని ఎంఈఓ మునిసుబ్రహ్మణ్యం కోరారు. బుధవారం కల్లివెట్టులోని ప్రాథమిక పాఠశాల్లో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి, సీఆర్సీ హెచ్ఎం రూపేష్‌కుమార్‌తో కలసి భోజనం చేశారు.

కిశోర వికాసం



మాట్లాడుతున్న సీడీపీఓ శోభారాణి

నాగలాపురం : బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు కిశోర వికాసం ఎంతగానో దోహద పడుతుందని సీడీపీఓ శోభారాణి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో కిశోర వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ శోభారాణి మాట్లాడుతూ.. బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు, బాల్యవివాహాల నివారణ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం శిక్షణలో బాలల అక్రమ రవాణా, వేధింపులు, రుతుక్రమ పరిశుభ్రత, మహిళా మిత్ర, సైబర్ నేరాలు తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బాబయ్య, ప్రధానోపాధ్యాయుడు కస్తూరయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, ఏపీఎం సీతారామ్, అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



విద్యార్థినులకు దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి : పట్టణంలోని బాలికల వసతిగృహ విద్యార్థినులకు బుధవారం శ్రీకాళహస్తి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. పట్టణంలో తమ అసోసియేషన్ ద్వారా పరిసర గ్రామాల బాలికల చదువు కోసం తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాము గుప్తా, అమరా జనార్దన్, నంద, కొండేటి గోపాల్, కార్తీక్ , చక్రపాణి పాల్గొన్నారు.

నాణ్యతతో సీసీ రోడ్ల నిర్మాణం



పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

నారాయణవనం : సీసీ రోడ్ల నిర్మాణాన్ని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. రూ.16 లక్షల అంచనా వ్యయంతో అరణ్యం కండ్రిగ, పాలమంగళం ఉన్నత పాఠశాలల వద్ద నిర్మించే సీసీ రోడ్లకు ఆయన భూమి పూజ చేశారు. పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాలమంగళం ఉన్నత పాఠశాలలో స్కాట్స్ అండ్ గైడ్ విభాగాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీడీఓ గుణశేఖర్, డిప్యూటీ డీఈవో ప్రభాకర్‌రాజు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థం



మాట్లాడుతున్న నారాయణ

రేణిగుంట(ఏర్పేడు): బాల్యవివాహాలు అనర్థదాయకమని ప్రగతి సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నారాయణ అన్నారు. ఏర్పేడు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ గదిలో బుధవారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ లెవెల్ మల్టీస్టేక్ హోల్డర్ కన్వర్జెన్సీ సమావేశం జరిగింది. బాల్య వివాహాలను అడ్డుకునేందుకు అన్ని శాఖల వారు సమష్టిగా కృషి చేయాలన్నారు. బాల్యవివాహాలతో జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సీడీపీఓ కృష్ణమంజరి, ప్రగతి కోఆర్డినేటర్ మంజూష, ఏర్పేడు మండల కోఆర్డినేటర్లు శిరీష, సుభాష్ చంద్రయ్య, సిబ్బంది , అంగన్‌వాడీ కార్యకర్తలు , ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం



రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఎస్కలేటర్ పనిచేయకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు వంతెనపైకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ఎస్కలేటర్ మూడు, నాలుగు రోజులుగా పనిచేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట)

హెచ్చరిక



గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సర్వేయర్లు పనితీరు బాగోలేదని, పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. బుధవారం కార్యాలయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రీవెన్స్ డేలో వచ్చే వినతులను విచారించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నల్లయ్య, మండల సర్వేయరు ప్రకాష్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

- బుచ్చినాయుడుకండ్రిగ

నిరాదరణ



శాంతి భద్రతలను పర్యవేక్షించే రక్షకభటుల నివాస గృహాలు నాగలాపురంలో శిథిలమవుతున్నాయి.42 ఏళ్ల కిందట నిర్మించిన భవనాలు ఒక్కొక్కటిగా మరమ్మతులకు గురవుతున్నాయి. రూ.2 కోట్ల విలువ చేసే ఆస్తుల గురించి ఆ శాఖ ఏ మాత్రం దృష్టి సారించడం లేదు.

- నాగలాపురం

నాడు సేవ నేడు శోభ

వైఎస్సార్‌సీపీ పాలనలో విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు చేపట్టిన 'నాడు–నేడు' సత్ఫలితాలు అందుతున్నాయి. ఆ దిశగా పాఠశాలలతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చెందాయి. ఇందులో భాగంగా వరదయ్యపాళెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అన్ని హంగులతో నూతన శోభ సంతరించుకుంది. కళాశాలను సందర్శించిన విద్యార్థుల తల్లిదండ్రులు గత ప్రభుత్వ ముందు చూపు ధోరణితో అభివృద్ధి చెందిన తీరుపై సర్వత్రా ప్రశంసల జల్లు కురుస్తోంది. అలాగే నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యా వ్యవస్థకు ఇచ్చిన ప్రాధాన్యం ఏ పాటిదో వరదయ్యపాళెం జూనియర్ కళాశాల అభివృద్ధే ఇందుకు నిదర్శనమని కితాబిస్తున్నారు.

– వరదయ్యపాళెం



నాడు-నేడు నిధులతో అభివృద్ధి చెందిన ప్రభుత్వ కళాశాల



కళాశాల ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఆర్చీ, గేటు

- కార్పొరేట్‌కు దీటుగా కళాశాల వసతులు
- గత ప్రభుత్వంలోని నాడు-నేడుతో అభివృద్ధి
- రూ.61 లక్షలతో పలు పనులు పూర్తి
- గత ప్రభుత్వ ఆలోచనపై ప్రశంసల జల్లు



కళాశాల భద్రతకు నిర్మించిన ప్రహరీ

వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 69 మంది, ద్వితీయంలో 74 మంది విద్యనభ్యసిస్తున్నారు. కళాశాల అభివృద్ధికి గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాడు–నేడు ద్వారా రూ.61 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో కళాశాలకు ప్రహరీ నిర్మాణంతో పాటు స్టడీ అవర్స్ కోసం హాలు, తాగునీటి కోసం రెండు ఆర్వో ప్లాంట్లు, డిజిటల్ విద్యను అందించేందుకు తరగతి గదుల్లో 7 ఐఎఫ్‌బీ ప్యానెల్స్ ఏర్పాటు, సిమెంటు రోడ్డు, కళాశాల భవనాలకు పూర్తి స్థాయిలో రంగులు, మరుగుదొడ్లు పనులను నూతనంగా చేపట్టారు.

విద్యార్థులకు భద్రత

కళాశాల ఏర్పాటు నుంచి ప్రధానంగా భద్రత సమస్య తలెత్తింది. దీంతో ప్రహరీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. గతంలో అనేక పర్యాయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద నిధులు మంజూరు కావడంతో కళాశాల సరిహద్దుకు సంబంధించి 500 మీటర్ల మేర ప్రహరీ నిర్మించారు. ఫలితంగా భద్రత సమస్య లేకుండా పోయింది. అంతేకాక ఎంతో విలువైన కళాశాల స్థలం ఆక్రమణకు గురయ్యే పరిస్థితులు వైదొలిగాయి. అటు విద్యార్థులకు భద్రతతో పాటు ఆస్తులకు రక్షణ కలిగింది. ప్రధాన ద్వారం వద్ద ఆర్చీ, గేటు ఏర్పాటు చేయడంతో పూర్తి స్థాయి భద్రతతో ఓ ఆదర్శ కళాశాలగా రూపుదిద్దుకొంది.



తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు



నూతనంగా ఏర్పాటు చేసిన సిమెంటు రోడ్డు

వసతులు సమకూరాయి



మా కళాశాల నాడు–నేడు ద్వారా అభివృద్ధి చెందింది. అన్ని మౌలిక వసతులు ఉన్నాయి. చక్కటి వాతావరణంలో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా కళాశాల రూపుదిద్దుకొంది. తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులతో విద్యా బోధన తమకు సులభతరంగా మారింది.

- ఇంద్రసేన, ఇంటర్ విద్యార్థి, జూనియర్ కళాశాల

పూర్తిస్థాయిలో అభివృద్ధి



కళాశాల పునర్నిర్మాణ పనులకు రూ.61 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. తల్లిదండ్రుల కమిటీ ద్వారా నాణ్యతతో కూడిన పారదర్శకమైన పనులు చేపట్టాం. ప్రస్తుతం కళాశాలకు అన్ని వసతులు సమకూర్చాం. అదే స్థాయిలో అధ్యాపకుల నుంచి విద్యాబోధనలు జరుగుతున్నాయి. ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా విలువలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నాం.

- పద్మావతి, ప్రిన్సిపల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, వరదయ్యపాళెం

12న రక్తదాన శిబిరం

శ్రీకాళహస్తి : రక్తదానం చేసి ప్రాణదాతలవుదామని యువతరం సేవాసమితి నిర్వాహకులు పేర్కొన్నారు. ఈనెల 12న జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని ఎన్టీఆర్ పార్కు సమీపంలో ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు గిరిజన కమిషన్ సభ్యుల పర్యటన

సత్యవేడు : ఏపీ గిరిజన కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ గురువారం సత్యవేడులో పర్యటిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మండల పరిధిలోని దాసుకుప్పం, సత్యవేడు, కొత్తమారికుప్పం, రాజగోపాలపురం గ్రామాల్లోని గిరిజన కాలనీల్లో గిరిజన కమిషన్ సభ్యులు పర్యటిస్తారన్నారు. మధ్యాహ్నం ఎంపీడీఓ కార్యాలయంలో గిరిజనుల సమస్యలపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని చెప్పారు.

కోడిపందేలపై నిఘా



మురళి, సీఐ, సత్యవేడు

వరదయ్యపాళెం : సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సత్యవేడు పోలీస్ సర్కిల్ సీఐ మురళి హెచ్చరించారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. పండుగ రోజుల్లో పేకాట, కోడి పందేలు, ఇతర జూదాలు నిర్వహించే స్థావరాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఎవరైనా జూదం ఆడినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో పేకాట, కోడిపందేల ఘటనలో అరెస్టు అయిన వారిని బైండోవర్ చేస్తామన్నారు. సంక్రాంతి సందర్భంగా సర్కిల్ పరిధిలో ప్రత్యేక నిఘా ఉంచుతామని సీఐ స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు శేష-యాళి వాహన సేవలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం వాయులింగేశ్వర స్వామి, జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు శేష–యాళి వాహనాలపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగనున్నట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8 గంటలకు స్వామి అమ్మవార్లకు శేష–యాళి వావాహన సేవలు నిర్వహిస్తామన్నారు. అనంతరం 10గంటలకు గొబ్బెమ్మ గ్రామోత్సవం ఉంటుందని చెప్పారు.

పేదలకు'సిపాయి' భరోసా



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : పేద ప్రజలకు సిపాయి భరోసాను అందిస్తున్నామని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. రేణిగుంట పట్టణంలో గతనెల 29వ తేదీ అనారోగ్యంతో మరణించిన అమరావతి కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కిట్‌ను ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం అందజేశారు. బుధవారం కర్మక్రియల్లో పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం 40 నిత్యావసర వస్తువులతో కూడిన సిపాయి భరోసా కిట్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అమరావతి చిన్న వయస్సులో మృతి చెందడం బాధాకరమన్నారు. మహిళలు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వన్నె రెడ్డి సంఘం నాయకులు మాజీ ఎంపీటీసీ మునిరత్నం రెడ్డి, డాక్టర్ బాబు, కెఆర్ సుబ్రహ్మణ్యం, సురేష్, వెంకటేశ్వర్లు, శివ పాల్గొన్నారు.

బాలికలకు సమాన హక్కులు



మాట్లాడుతున్న సీడీపీఓ కృష్ణమంజరి

రేణిగుంట(ఏర్పేడు) : బాలికలకు సమాజంలో సమాన హక్కులు ఉన్నాయని, వాటిని హరింపజేయాలని చూస్తే చట్టం కఠినంగా శిక్షిస్తుందని రేణిగుంట సీడీపీఓ కృష్ణమంజరి పేర్కొన్నారు. ఏర్పేడు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం రేణిగుంట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు కిశోర వికాసంపై శిక్షణ జరిగింది. సైబర్‌నేరాల బారిన పడకుండా జాగ్రత్త పడాలన్నారు. యుక్త వయసులో బాలికల్లో చోటు చేసుకునే శారీరక, మానసిక మార్పులకు అనుగుణంగా సానుకూల ప్రవర్తన కలిగి ఉండేలా తల్లి ముఖ్యమైన పాత్ర పోషించాలన్నారు. డీటీ రోజారమణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

6 నెలల్లో ఇంకెంతమందిని వేధిస్తాడో..

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పురపాలక సంఘంలో ఓ అధికారి మరో ఆరు నెలల్లో ఇంకెన్ని రకాలుగా వేధిస్తాడోనని సిబ్బంది హడలెత్తిపోతున్న విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అడ్డదారుల్లో దొరికింది దండుకోవడానికి అధికారాన్ని ఉపయోగించుకుంటున్నాడని దుమ్మెత్తిపోస్తున్నారు. మహిళా ఉద్యోగులకు వారికి సెలవులను వాడుకునే అవకాశం ఇవ్వడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు, పాలకులకు ఫిర్యాదు చేస్తే ఆరు నెలల్లో పదవీ విరమణ చేస్తారు వదిలేయండి అంటూ అతనిపై సానుభూతి చూపిస్తున్నారని, అందువల్లనే అతని వేధింపులు ఎక్కువయ్యాయని సోషల్ మీడియాలో వాపోతున్నారు. దీనిపై పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ఆ అధికారిపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆలయ గోడలూ వదలని కూటమి నేతలు



కోనేరు చుట్టూ రాజకీయ పోస్టర్లు



భేరివారిమండపంపై వేసిన పోస్టర్లు

శ్రీకాళహస్తికి ఆధ్యాత్మిక శోభను దెబ్బతీసేలా చేసేలా కూటమి నేతలు రాజకీయ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కోనేరు చుట్టూ వాహనాలు నిలపకూడదని, దీనివల్ల ఆధ్యాత్మికత దెబ్బతింటుందని సోషల్ మీడియా ఉపన్యాసాలు దంచేస్తుంటారు. అయితే కూటమి ప్రభుత్వానికి సంబంధించిన రాజకీయ పోస్టర్లను అతికిస్తుంటే నోరు తెరిచి చూస్తుంటారు. సొంత పార్టీ అయితే న్యాయమా.. మరో పార్టీ అయితే అన్యాయమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కోనేరు చుట్టూ ఉన్న గోడపత్రికలను తొలగించి ఆధ్యాత్మిక భావన పెంపొందేలా చూడాల్సిన బాధ్యత ఆలయ అధికారులపై ఉంది.

- శ్రీకాళహస్తి

అ'పూర్వ' సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1982–83వ సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. అప్పటి గురువులు గంగిరెడ్డి, తులసీరాం, చంద్రశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో పాటు ప్రజా కళావేదిక సంయుక్తంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సునీత, పూర్వ విద్యార్థులు జయపాల్, కృష్ణమాచార్య పాల్గొన్నారు.